## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కర్నూలులో హైకోర్టు బెంచ్ ను త్వరలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ❖ పోలీసులకు నైపుణ్య శిక్షణ అవసరమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- ❖ పోస్టు ఆఫీసులను 5 వేల కోట్ల రూపాయలతో ఆధునీకరించామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ వెల్లడించారు.
- ❖ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2024-25లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 5 అవార్డులను గెలుచుకుంది.
- ❖ తిరుపతి జిల్లాలోని ఏర్పేడులో నూతనంగా నిర్మించిన ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ను కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించారు.

==============================

కర్నూలులో హైకోర్టు బెంచ్ ను త్వరలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అదే విధంగా కడపలో రాయలసీమ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పుతామని చెప్పారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనులకు కృష్ణా జలాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటి వినియోగదారులతో సమావేశమైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. అదే విధంగా ప్రముఖ వాణిజ్య సంస్థలను రాయలసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమకు ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, కనీసం రెండు మెట్ట పంటలు వేసుకునేలా నీటి సౌకర్యం కల్పించాలని ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

==============================

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన “స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2024-25”లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐదు అవార్డులు గెల్చుకుంది. ఢిల్లీలో ఈ రోజు రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక శాఖ

మంత్రి పి.నారాయణ అవార్డులు స్వీకరించారు. మన రాష్ట్రం నుంచి విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లు అవార్డులు దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా పాత్రికేయులతో మంత్రి నారాయణ మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు అందుకోవడం గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "స్వచ్ఛ భారత్ మిషన్"పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

==============================

పోలీసులకు నైపుణ్య శిక్షణ అభివృద్ధి కోసం పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం చిన్నకరగ్రహారం రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కు ఈ రోజు గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా, 45 ఎకరాల స్థలంలో 16.75 కోట్ల రూపాయలతో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నిర్మించనున్నామని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... ఎక్సైజ్ శాఖకు కూడా త్వరలో ట్రైనింగ్ సెంటర్ రాబోతుందని చెప్పారు.

==============================

దేశ వ్యాప్తంగా పోస్ట్ ఆఫీసులను 5 వేల కోట్ల రూపాయలతో ఆధునీకరించామని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణ అభివృద్ధి శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు కేంద్రంగా నూతనంగా 2 కోట్ల 2 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన హెడ్ పోస్ట్ ఆఫీస్ భవనాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోస్ట్ ఆఫీసులు ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సేవింగ్స్ బ్యాంక్, పేమెంట్స్ బ్యాంక్గా పోస్టాఫీసులు పని చేస్తున్నాయని ఆయన గుర్తు చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==============================

తిరుపతి జిల్లాలోని ఏర్పేడులో నూతనంగా నిర్మించిన ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ను కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ రోజు దృశ్య మాధ్యమ విధానం ద్వారా ప్రారంభించారు. 3 కోట్ల రూపాయల నిధులతో ఈ కేంద్రాన్ని ఐఐటి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఏర్పేడు ఐఐటిలో జరిగిన కార్యక్రమంలో ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

==============================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భవిష్యత్ అవసరాల నిమిత్తం తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజ్ కేంద్ర నిర్మాణానికి టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు ఈ రోజు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా ఐఓసీఎల్ సంస్థ ఎల్పీజీని టీటీడీకి నిరంతరాయంగా సరఫరా చేస్తోందని తెలిపారు. 8.13 కోట్ల రూపాయల వ్యయంతో 1.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్ను టీటీడీ-ఐఓసీఎల్ సంయుక్తంగా ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

==============================

గిరిజన ప్రాంతాల్లో సుస్థిరమైన వ్యవసాయ అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్. ఎస్. రావత్ కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోని పద్మాపురం గార్డెన్స్ లో వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, డి.ఆర్.డి.ఏ, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పండ్ల తోటలను మరింత విస్తరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో సాగు చేస్తున్న వరి, రాగులు, రాజ్మా, ఇతర చిరు ధాన్యాల పంటల విస్తీర్ణంపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

==============================

కేకే లైనులో సాంకేతిక కారణాల వల్ల కిరండూల్ రైళ్లతో పాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్సిటీ ఎక్స్ ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు కొరాపుట్ వరకే నడుపుతున్నామని వాల్తేరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్ ప్రెస్ (18515) ఈ నెల 18న విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు నడుస్తుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో కిరండూల్- విశాఖ ఎక్స్ ప్రెస్ ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కొరాపుట్ లో బయలుదేరి విశాఖ చేరుతుందని వెల్లడించారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 82,634 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 375 పాయింట్ల నష్టంతో 82,259 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100 పాయింట్ల నష్టంతో 25,111 వద్ద ముగిసింది.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==============================

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు విశాఖపట్నం చేరుకున్న జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామచందర్ కు స్థానిక అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గాజువాక నియోజకవర్గంలోని మిందిలోన బి.హెచ్.ఈ.ఎల్. కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై అనేక అంశాలపై సమీక్షించారు.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================
==============================